ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శనివారం 18 మే 2024

లక్ష్య సాధనకు కృషి చేయాలి - కలెక్టర్ 8లో..

రక్తపోటు నియంత్రణతో ఎక్కువ కాలం జీవించవచ్చు 8లో..

సాగుప్రణాళిక ఖరారు



- జిల్లాలో 2,77,743 ఎకరాల్లో పంటల సాగు అంచనా
- గత ఏడాది కంటే పెరగనున్న విస్తీర్ణం
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

యాసంగి ముగిసి వానాకాలం పంటల సీజన్ ప్రారంభం అవుతున్నది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంత విస్తీర్ణంలో ఏయే రకాల పంటలను సాగు చేయనున్నారు.. ఆ పంటలకు ఎంత ఎరువులు అవసరం కానున్నాయి.. విత్తనాలు ఎన్ని కావాలి.. అనే విషయమై జిల్లా వ్యవసాయ శాఖాధికారులు వారం రోజుల నుంచి సాగు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 25వ తేదీ నుంచి రోహిణికార్తె ఆగమనంతో వానాకాలం సీజన్ ప్రారంభం కానున్నది. ఈమేరకు పది రోజుల ముందే సాగు ప్రణాళికను సిద్ధం చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి, వ్యవసాయ బావులు, బోరు బావులు, చెరువులు, కుంటల కింద 2,77,743 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నారని అంచనా వేశారు. గత ఏడాది వానాకాలంలో 2,77,003 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది అదనంగా 740 ఎకరాల్లో సాగు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో అత్యధికంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలనే సాగు చేస్తున్నారు. వానా కాలంలో 2,08,814 ఎకరాల్లో వరి, 780 ఎకరాల్లో మొక్కజొన్న, 16 ఎకరాల్లో పెసర, 5 ఎకరాల్లో మినుము, 158 ఎకరాల్లో కంది, 10 ఎకరాల్లో వేరుశెనగ, 5 ఎకరాల్లో నువ్వులు, 57,269 ఎకరాల్లో పత్తి, 10,686 ఎకరాల్లో మిర్చి, పసుపు, కూరగాయల పంటలు సాగు కానున్నాయని అధికారులు అంచనా వేశారు. ఈ పంటల సాగుకు 32,082 మెట్రిక్ టన్నుల యూరియా, 8,280 టన్నుల డీఏపీ, 24,579 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 6,889 పొటాష్ ఎరువులు, 500 టన్నుల సూపర్ సల్ఫేట్ ఎరువులు, మొత్తం 72,330 టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వద్ద 11,247 టన్నుల ఎరువులు, ప్రైవేట్‌లో 10,171 టన్నులు, ఆయా సొసైటీల్లో 1,825.4 టన్నులు, వివిధ కంపెనీల గోడౌన్లలో 5,770.63 టన్నులు, మొత్తం 29,014 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలతో పాటు వివిధ రకాల పంటలకు సంబంధించిన సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉంచారు. 11వేల క్వింటాళ్ల జనుము, 1000 క్వింటాళ్ల పిల్లి పెసర, 500 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు, 52,203 క్వింటాళ్ల వరి విత్తనాలు, 1,88,601 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, 6.32 క్వింటాళ్ల కంది, 1.28 క్వింటాళ్ల పెసర విత్తనాలు, 40కిలోల మినుము విత్తనాలు అందుబాటులో అందుబాటులోకి తీసుకవచ్చారు.

● సాగు పనుల్లో రైతులు నిమగ్నం..

యాసంగి వరి కోతలు పూర్తి కావడంతో కొంత మంది రైతులు ధాన్యాన్ని విక్రయించుకోగా, మరికొంత మంది రైతులు కల్లాల్లో, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పోశారు. మిగతా రైతులు వేసవిదుక్కుల పనులు చేపడుతున్నారు. వర్షాధారంగా సాగయ్యే పత్తి, మొక్కజొన్న, నువ్వులు, పెసర, బబ్బెర, తదితర పంటలను సాగు చేసేందుకు వేసవి దుక్కులు దున్ని భూములను చదును చేస్తున్నారు. ట్రాక్టర్లతో దుక్కులను దున్నుతున్నారు. జూన్‌లో కురిసే తొలకరి జల్లులకు మరొకసారి దుక్కి దున్ని అచ్చుకొట్టి విత్తనాలు వేయనున్నారు. వరి కోతలు పూర్తి చేసిన రైతులు పొలాల్లో పెద్దగా ఉన్నటువంటి వరి కొయ్యలను కాలుస్తున్నారు. మృగశిర కార్తెలోగానీ, అరుద్ర కార్తెలోగానీ వరి నార్లు పోసేందుకు రైతులు విత్తనాలు సేకరిస్తున్నారు. ఈసారి ముందస్తుగానే నైరుతి రుతు పవనాలు వస్తాయని, వర్షాలు బాగానే పడతాయని వాతావరణ కేంద్రం నిపుణులు చెబుతున్నారు. రెండు రోజుల నుంచి జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండడంతో సీజన్ ప్రారంభమైన తర్వాత వర్షాలు పడతాయా లేదా చూడాలని రైతులు అంటున్నారు. గత ఏడాది ఆశించిన మేరకు వర్షాలు పడడంతో రెండు సీజన్లలో పంటలు సాగయ్యాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండాయి. ప్రస్తుతం ఈ రెండు ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి వెళ్లిపోయాయి. భారీ వర్షాలు కురిస్తే తప్ప అవి నిండే పరిస్థితి లేదు. మహారాష్ట్ర ఎగువ భాగంలో వర్షాలు పడితే ఎస్సారెస్పీ, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో వర్షాలు కురిస్తే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండనున్నది. జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మార్కెట్‌లో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లాకు కావాల్సిన ఎరువులు సకాలంలో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పాఠశాలల్లో సకాలంలో పనులు పూర్తిచేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

పెద్దపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు మంచి పురోగతి సాధించారని, దాదాపు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీని ఏర్పాటుచేసి కనీస మౌలిక సదుపాయ పనులు చేపట్టారన్నారు. వాటన్నింటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూనిఫామ్ జిల్లాలకు చేరుతున్నాయన్నారు. జిల్లాలో కుట్టుమిషన్లలో అనుభవం కలిగిన, గుర్తించిన స్వశక్తి మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాంలు కుట్టే ఆర్డర్ అందించాలని సూచించారు. పెండింగులో ఉన్న ధరణి దరఖాస్తులను పరిశీలించి మే చివరి నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, ధరణి దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్లు రెగ్యులర్‌గా తహసీల్దారులతో సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా పెండింగ్ సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధరపై కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, జీవీ శ్యాంప్రసాద్ లాల్, ఆర్డీవోలు హనుమా నాయక్, బి.గంగయ్య, డీఈవో డి మాధవి, డీఆర్డీవో రవీందర్, డీసీవో శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సీపీవో గంప రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, మే 17: జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ఆగస్టు 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ నర్సింహాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్సెస్సీ మెమో, బోనఫైడ్, కులం, ఆధార్, ఇతర ధ్రువపత్రాలను స్కాన్‌చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకావాలని, ఈ దరఖాస్తులు ఈనెల 16 నుంచి జూన్ 10వరకు ఐటీఐ.తెలంగాణ.గోవ్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ ఫీజు వంద రూపాయలు చెల్లించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదు తీసుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని విత్తన డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల లేబుల్స్, కలర్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే విత్తనాలు అమ్మాలని తెలిపారు. గడువు ముగిసిన విత్తనాల బ్యాగులను పూర్తిస్థాయిలో స్టాక్ నుంచి తొలగించాలని, తనిఖీల సమయంలో గడువు ముగిసిన విత్తన బ్యాగులు విక్రయిస్తున్నట్లు దొరికితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిరిగిన విత్తనాల బ్యాగులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించవద్దని, సబ్సిడీ ఉన్న విత్తనాలు అర్హులైన వారికి మాత్రమే విక్రయించాలన్నారు. లైసెన్స్ లేని డీలర్లు విత్తనాలు విక్రయించడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విత్తన షాపు విక్రయదారులు రిజిస్టర్ మెయింటెన్ చేయాలని సూచించారు. విత్తన షాపులో అందుబాటులో ఉన్న విత్తనాల స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నోటీస్ బోర్డుపై నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టడానికి జిల్లా స్థాయిలో పోలీసు, వ్యవసాయ, విత్తన ధ్రువీకరణ సంస్థల అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ- పాస్ యంత్రాల ద్వారా మాత్రమే రైతులకు ఎరువులు, విత్తనాలను అమ్మాలని ఆదేశించారు. ఏవో, ఏఈవోలు, పోలీసు అధికారులు సమన్వయంతో ఎరువులు విత్తనాల షాప్‌లపై జాయింట్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బీటి 3 ప్రత్తి రకాల విత్తనాలకు చట్ట బద్ధత లేదని దీనివలన పర్యావరణం, మానవాళి జీవన శైలికి హాని చేకూరుతుందని, కావున ఎవరైనా ఈ విత్తనాలను విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాల వళ్ళ పంట నష్టం గురించి రైతుల నుండి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డి.ఆదిరెడ్డి, ఏసీపీ కృష్ణ, డీసీవో అధికారి శ్రీమాల, డీలర్‌లు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



కొలనూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, మే 17 : రైతులు అధైర్యపడవద్దని కేంద్రాల్లోని ఎలాంటి ధాన్యాన్ని అయిన పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి తీరుతామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కొలనూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే విజయరమణారావు సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా తరలించాలని చేయాలని, ధాన్యం తరలింపునకు లారీల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ధాన్యంలో కోత లేకుండా తూకం వేసి వారంలో నియోజకవర్గంలోని కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలింపు పూర్తిచేయాలన్నారు. నియోజకవర్గంలోని కేంద్రాల్లో ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే తెలిపారు. ధాన్యం తూకంలో ఎలాంటి జాప్యం చేయకుండా వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించి కేంద్రాల్లో కొనుగోలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ సర్పంచులు సామ శంకర్, కుంచం మల్లయ్య, సింగిల్‌విండో మాజీచైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, కొల్లూరి చందు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

పెద్దపల్లి రూరల్, మే 17 : మండలంలోని సబ్బితం గ్రామంలోని రామాలయంలో రెండు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. దాదాపు గ్రామంలో 200మంది మహిళలు పాల్గొని మంగళహారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గీత సత్సంగ్ సభ్యులు, మాజీ సర్పంచ్ సదయ్య, తిరుపతి, రమేష్, సతీష్, కనుకయ్య, రవి, గుమ్మడి ప్రసాద్ , రాజమణిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు టీఎన్జీవోల సంఘం శుభాకాంక్షలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

పెద్దపల్లిటౌన్, మే 17: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమిల్‌ఖాన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా ఉద్యోగుల జేఏసీ టీఎన్జీవోస్ యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటు ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా ఉద్యోగులకు సంబంధించిన అన్ని మౌలిక వసతులు కల్పనలో కలెక్టర్ పర్యవేక్షించారని, ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఉద్యోగులందరూ ఉత్సాహంగా ఎలక్షన్ విధుల్లో పాల్గొన్నారన్నా రు. ఎలక్షన్ విధుల్లో పాల్గొన్న ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎలక్షన్ విధుల్లో పాల్గొన్న ఉద్యోగులందరికీ ఒకనెల వేతనాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమురయ్య, మహేందర్‌రెడ్డి, సురేష్, ప్రవీణ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు లేని జూలపల్లి ఆర్టీసీ బస్టాండ్

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



జూలపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్

జూలపల్లి, మే 17 : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ గ్రామానికి దూరంగా ఉండటంతో ప్రయాణికులు అక్కడికి వెళ్లడంలేదు. లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో నర్మిచంచిన ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులు లేక వృథాగా ఉండి శిథిలావస్థకు చేరుకుంది. ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులు లేక వృథాగా ఉండడంతో దానికి సంబంధించిన ఆవరణలోని భూమి కబ్జాకు గురవుతుందని, దీనిపై స్పందించి సంబంధిత అధికారులు ప్రభుత్వ ఆస్తులను కాపాడి రక్షణ కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాది క్రితం ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరణ చేపట్టింది. శిథిలావస్థకు చేరుకున్న బస్టాండ్‌లో కొంతమేరకు పనులు చేయించిన అధికారులు ప్రయాణికులకు తాగునీరు, టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు తిరిగిపోతున్నప్పటికీ, అక్కడ ప్రయాణికులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు లేకపోవడంతో ప్రయాణికులు రాక బస్టాండ్ ఆవరణ వెలవెలబోతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

సుల్తానాబాద్, మే 17: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో దొంగలు ధాన్యం ఎత్తుకెళ్లారు. సుల్తానాబాద్ పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన జునుగరి కుమార్ అనే రైతు తనకు చెందిన సన్న రకం వడ్లను మరపట్టించేందుకు సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో అరబెట్టుకున్నారు. ఇది గమనించిన దొంగలు రాత్రికి రాత్రే ఎనిమిది బస్తాల సన్నరకం ధాన్యం దొంగిలించి చిరు వ్యాపారులకు అమ్ముకున్నారు. ఈ సంఘటనపై రైతు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాడు. కార్యదర్శి హమీద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే శుక్రవారం రైతు కుమార్ అనుమానంతో స్థానిక మార్కండేయకాలనీలో తన ధాన్యం కోసం వెతకగా ఒక ఆటో ధాన్యంతో అనుమానాస్పదంగా ఉండడాన్ని గుర్తించాడు. ఆటోతోపాటు అనుమానితులను పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాగా ఈ సీజన్ మొదట్లో ఇదే వ్యవసాయ మార్కెట్ యార్డులో గట్టేపల్లికి చెందిన నల్లవెల్లి మధునయ్య అనే రైతుకు చెందిన 15బస్తాల ధాన్యం దొంగలు చోరీకి గురికావడం గమనార్హం.

బాలికల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



జెమ్ వర్క్‌షాప్‌లో శిక్షణ పొందుతున్న బాలికలతో కలెక్టర్



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్, ఎన్టీపీసీ ఈడీ

జ్యోతినగర్, మే 17 : బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఎన్టీపీసీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ వర్క్‌షాప్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఎన్టీపీసీ సంస్థ రామగుండంలో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి భూసేకరణ అంశంలో తన తండ్రి సైతం విధులు నిర్వహించారన్నారు. ఎన్టీపీసీ సంస్థతో తనకున్న అనుభవాలను కలెక్టర్ గుర్తుచేసుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అభివృద్ధి కొలమానాల్లో ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం చేరడం కీలకంగా భావిస్తారని, దీన్ని నిజం చేయడంలో ఎన్టీపీసీ సంస్థ, ఉద్యోగులు, సిబ్బంది చేసిన కృషి ప్రశంసనీయమని తెలిపారు. అమ్మాయిల సాధికారత కోసం కృషి చేయడం వల్ల సమాజం గొప్పమార్పులు వచ్చి అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక కుటుంబంలో ఒక అమ్మాయిని గొప్ప చదువులు చదివించడం వల్ల ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. బాలికలను కొన్ని రంగాలకే పరిమితం చేయవద్దని, మగవారితో సమానంగా వారికి క్రీడలు, సైన్యం, మొదలగు రంగాలలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. ఇటీవల 10వ తరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థినిని కలెక్టర్ అభినందించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు మాట్లాడుతూ, గర్ల్స్ ఎంపవర్మెంట్ మిషన్(జెమ్) వర్క్‌షాప్‌ను 2018లో సీఎండీ ఎన్టీపీసీ దివ్యాంచల్‌లో ప్రారంభించారని, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 7400 మంది బాలికలకు జెమ్ కార్యక్రమం కింద శిక్షణ అందించామన్నారు. 2019లో రామగుండం ఎన్టీపీసీ మొదటిసారి జెమ్ వర్క్‌షాప్ నిర్వహించిందని తెలిపారు. జెమ్ కార్యక్రమం కింద బాలికలు తమ లక్ష్యాలను చేరుకునేలా ఎన్టీపీసీ సహకారం అందిస్తుందని, రామగుండంలో దాదాపు 360 మంది బాలికలు జెమ్ కార్యక్రమం కింద శిక్షణ పొందారని, ప్రస్తుత సంవత్సరం 120మంది ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలికలను ఎంపికచేసి వారికి యోగా, ఇంగ్లీష్, మ్యాథ్స్, కరాటే మొదలగు శిక్షణ అందించామన్నారు. అనంతరం జెమ్ కార్యక్రమంలో శిక్షణ పొందిన బాలికలకు మెమెంటో, ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. అంతకుముందు బాలికలు చేసిన నృత్య ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లిటౌన్, మే 17: బెస్ట్‌అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25సంవత్సరానికి జిల్లాలోగల బెస్ట్ అవైలబుల్ స్కూల్స్(రెసిడెన్షియల్ నాన్ రెసిడెన్షియల్) కింద పాఠశాలల్లో ఒకటవ తరగతి(నాన్ రెసిడెన్షియల్)లో 70 సీట్లు, 5వ తరగతి(రెసిడెన్షియల్)లో 73సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశ దరఖాస్తు గడువు జూన్7తో ముగుస్తుందని, ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. లాటరీ పద్ధతిన, రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందని, దరఖాస్తు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం లభిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తులను ధ్రువీకరణ పత్రాలతో జూన్ 7సాయంత్రం 5గంటలలోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. జూన్ 11న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయబడుతుందని, 2018 జూన్ 1వ తేది నుంచి 31మే 2019 మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 9010136407, 9908261045లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రూ.7,190 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 17: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,190 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు రైతులు 95 క్వింటాళ్ల పత్తి తీసుకువచ్చారు. వ్యాపారులు గరిష్ఠ ధర 7,190 రూపాయలు, కనిష్ఠ ధర ఐదు వేల రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 17: మండలంలో వెంకటాపూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. వాహనాన్ని స్వాధీన పర్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

అకాల వర్షంతో నష్టం

● తడిసిన ధాన్యం ● విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కురిసిన వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి.

మెట్‌పల్లి రూరల్, మే 17: మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

● ఇబ్రహీంపట్నం: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, గోధూర్, వేములకుర్తిలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

● కథలాపూర్: మండలంలోని చింతకుంట, ఊట్‌పల్లి, పెగ్గెర్ల, భూషణ రావుపేట, దుంపెట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వ ర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లో వీధులు జలమయమయ్యాయి.

● మల్యాల: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రామన్నపేట, మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, లంబాడిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ధాన్యం తడిసింది.

● వేములవాడ టౌన్: మండలంలో శుక్రవారం భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చెట్టు విరిగి రోడ్డుపై పడింది. వేములవాడ మండలం ఆరెపల్లి సమీపంలోని పెట్రోల్‌బంక్ సమీపంలోని తుమ్మచెట్టు విరిగి రోడ్డుపైన పడింది. ఆ సమయంలో రోడ్డుపైన వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కరీంనగర్-వేములవాడ ప్రధాన రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

● కోనరావుపేట: మండలంలో కురుస్తున్న వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. లారీల కొరతతో ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతోంది. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

● ధర్మారం: మండల కేంథ్రంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురిసింది. రోడ్లన్నీ బురదమయమయ్యాయి. వర్షం కారణం గా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

● మంథని/మంథని రూరల్: మండలంలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో, వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన ధాన్యం తడిసింది. మండలంలోని ఆరెంద, వెంకటాపూర్, మల్లారంతో పాటు పలు గ్రామాల్లో ఇంకా కోయని పొలాలు నేలకొరిగాయి. ఖానాపూర్ గ్రామంలో గాలి దుమారానికి ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలు తెగిపడడంతో అమ్మకుంటి సమ్మయ్య అనే రైతుకు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి.

● కళ్యాణ్‌నగర్: గోదావరిఖనిలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారు జామున 4గంటల వరకు కురిసింది. భారీ వర్షంతో రామగుండంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు 2.5సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


మెట్‌పల్లి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం


ధర్మారంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు


వేములవాడ మండలం ఆరెపల్లిలో రోడ్డుపై విరిగి పడిన తుమ్మచెట్టు


రుద్రంగిలో ధాన్యం కుప్పలు చూట్టూ చేరిన వర్షపు నీరు

పూర్తి స్థాయిలో పనులు కల్పించాలి

● ఉపాధి కూలీల ఆందోళన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

కోరుట్ల రూరల్, మే 17: తమకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు శుక్రవారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ గ్రామ శివారులోని నర్సింహులుకుంట, బూర్గం కుంటల మాటు కాల్వల పూడికతీతతో పాటు ఇతర పనులను చేస్తుండగా ఆ ప్రాంతం లోని రైతులు అడ్డుకుంటున్నారన్నారు. దీంతో తాము పని దినాలను కోల్పోతున్నామని, ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తెచ్చేందుకే ఆందోళనకు దిగామన్నారు. తహసీల్దార్ కిషన్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. చేయవలసిన పనుల కోసం సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి పనులు కల్పిస్తామని తెలపడంతో కూలీలు ఆందోళన విరమించారు.

పాత కక్షలతో దాడి: ఇద్దరి మృతి


శ్రీనివాస్, మహేష్ (ఫైల్)

బుగ్గారం మే 17: జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలో పాత కక్షలు పురి విప్పాయి. పాత పగలు మనసులో పెట్టుకుని మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన దిటి శ్రీనివాస్(36), దీటి మహేష్ (38)పై అదే గ్రామానికి చెందిన బుర్ర నవీన్‌తో పాటు కొంత మంది కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాస్, మహేష్ మృతి చెందారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర నవీన్, దీటి శ్రీనివాస్ పక్క పక్క ఇళ్లలో నివసిస్తుంటారు. ఆ రెండు ఇళ్ల మధ్యలో ఉన్న ఇంటిని రెండేళ్ల క్రితం శ్రీనివాస్ కొన్నాడు.

ఆ ఇల్లు తనకు కావాలంటూ నవీన్ తరచూ శ్రీనివాస్‌తో గొడవ పడేవాడు. ఇదే విషయమై గ్రామం లో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. ఇది మనసులో పెట్టుకున్న నవీన్ మరి కొందరితో కలిసి గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి బయట పడుకున్న శ్రీనివాస్‌తో పాటు అతని బంధువు దీటి మహేష్‌లపై కర్రలతో దాడి చేశాడు. శ్రీనివాస్, మహేష్ అరుపులకు ఇరుగు పొరుగు వారు రావడంతో నిందితులు ఘటనా స్థలం నుంచి పారిపోయరు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న మహేష్‌ను జగిత్యాల అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మహేష్ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీటి శ్రీనివాస్‌కు వివాహం జరిగింది. మహేష్‌కి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. శ్రీనివాస్ చెల్లెలు మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● హెచ్‌సీఏ, కేడీసీఏ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ ● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు చోట్ల శిబిరాలు

● పాల్గొంటున్న 500 మంది క్రీడాకారులు



కరీంనగర్‌లో క్రికెట్ శిక్షణ పొందుతున్న బాలికలు, బ్యాటింగ్ చేస్తున్న బాలుడు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 17: వేసవి సెలవుల్లో క్రికెట్ శిక్షణపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు కేంద్రాల్లో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. కేడీసీఏ ఆరు సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలు నిర్వహించలేదు. ఈ యేడాది హెచ్‌సీఏ, కేడీసీఏ శిబిరాలను నిర్వహిస్తుండడంతో విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు.

నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 500 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. అండర్- 14, అండర్-16, అండర్-19, అండర్-23 వయసు విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఉదయం 5 నుంచి 8.30 వరకు శిక్షణ ఇస్తున్నారు. కరీంనగర్‌లో వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదుట ఉన్న జిల్లా క్రికెట్ సంఘం మైదా నంలో, సెయింట్ అల్ఫోన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. గోదావరిఖనిలోని జీఎం గ్రౌండ్‌లో, సిరిసిల్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. అత్యధికంగా గోదావరిఖనిలో 200 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతుండగా కరీంనగర్‌లో 160 మంది, సిరిసిల్లలో 140 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. క్రీడాకారులకు మూడు శిక్షణ కేంద్రాల్లో శిక్షణ అనంతరం హెచ్‌సీఏ సౌజన్యంతో అరటి పండ్లు, కోడి గుడ్లు, హెల్త్ డ్రింక్స్ అందిస్తున్నారు. కరీంనగర్‌లో డి.శ్రీనివాస్, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, మరో ముగ్గురు కోచింగ్ ఇస్తున్నారు. గోదావరిఖనిలో కిరణ్, సుదేశ్‌కుమార్, సిరిసిల్లలో ప్రసాద్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

● శిబిరాలను సందర్శించిన హెచ్‌సీఏ కమిటీ

ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కమిటీ సభ్యులు ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరాలను సందర్శించారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు కార్యదర్శి, కోశాధికారి, ఉపాధ్యక్షులు ఈ కమిటీలో ఉన్నారు. రాష్ట్రంలో క్రికెట్ క్రీడాభివృద్ధికి, క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

● శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- వి ఆగంరావు, కేడీసీఏ అధ్యక్షుడు



హెచ్‌సీఏ సహకారంతో కేడీసీఏ నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, ఔత్సాహిక యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిబిరాల్లో శిక్షణకుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంటాయి. గ్రామీణ ప్రాంతంలోని అత్యుత్తమ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయి.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

● రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించిన అన్నదాతలు

● అధికారుల హామీతో ధర్నా విరమణ





రాయికల్-మైతాపూర్, కరీంనగర్-వేములడాడ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

రాయికల్, మే 17: ధాన్యం కొనుగోలు జాప్యంతో పాటు తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించకపోవడంతో రాయికల్-మైతాపూర్ రోడ్డులో రైతులు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సొసైటీ కొనుగోలు కేంద్రం నిర్లక్ష్యంతో రోడ్డుపైకి రావాల్సి వస్తుందని, కేవలం ఆరుగురు హమాలీలతో ధాన్యాన్ని తూకం వేస్తున్నారని, తూకం వేసిన ధాన్యాన్ని లారీల కొరత ఉందంటూ మిల్లుకు తరలించకపోవడంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షంతో తడిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే వర్షాలు కురిసి ధాన్యం తడిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవోను ప్రశ్నించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల జాప్యంతో ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయించాల్సి వస్తోందని, త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని సొసైటీ అధికారులకు అనేకసార్లు మొర పెట్టుకున్నా స్పందన లేకపోవడంతో ప్రతి సంవత్సరం రోడ్డు ఎక్కాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేగంగా కొనుగోళ్లు జరిపి ధాన్యాన్ని వెంటనే మిల్లుకు తరలించే ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. రైతుల ఆందోళన సమాచారంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య, ఏఎస్సై దేవేందర్ పది రోజుల్లో కల్లాల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఈవోకు సూచించి రైతులకు నచ్చజెప్పడంతో నిరసనను విరమించారు. రైతుల ధర్నాతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

● వేములవాడ మండలం అనుపురంలో..

వేములవాడ టౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్న కొనుగోలులో జాప్యం చేస్తున్నారని వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించారు. నాంపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో అనుపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 20 రోజులుగా కొనగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండుసార్లు వర్షానికి తడిసాయని, ఇప్పటికి ధాన్యం కొనుగోలు చేయకోవడంతో గ్రామానికి చెందిన రైతుల ధాన్యం బస్తాలతో సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వేములవాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీచ్చారు. దీంతో రైతులు శాంతించి ధర్నాను విరమించారు.

● నాంపల్లి ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ధాన్యం కొనగోళ్లు చేస్తున్నామని, అనుపురం గ్రామంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు కావాలని రాజకీయం చేస్తున్నారని సింగిల్ విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి ఆరోపించారు. అనుపురం రైతులు ధర్నా చేశారని తెలుసుకున్న సల్మాన్‌రెడ్డి అనుపురం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

ఘనంగా గంగాదేవి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గంగపుత్రులు

రాయికల్, మే 17: మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని పెద్ద చెరువు గట్టు మీద నెలకొన్న గంగాదేవి ఆలయంలో శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పురోహితులు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగాశివుని కల్యాణోత్సవం కోసం హోమం నిర్వహించారు. చెరువులను కాపాడుకోవడమే గంగమ్మ ఉత్సవాల ప్రత్యేక అని వారు తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కామని రజనీ కుమార్, కార్యదర్శి హరీష్ కుమార్, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్, సభ్యులు మాసపేట మల్లయ్య, వెంకట్రాజం, కామని లక్ష్మయ్య, సూర్యప్రకాశ్, రాజేశం, భూమరాజం, నరేష్, రమేష్, అరవింద్, ప్రభాస్, రాజ్ కుమార్, చిన్న నర్సయ్య, గంగాధర్, మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, మే 17: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మొదటి దఫా అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా 100 రూపాయల రిజిస్ట్రేషన్‌తో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈ నెల 16 నుంచి జూన్ 10వరకు స్వీకరించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరెళ్లలో మూడిళ్లలో చోరీ

ధర్మపురి, మే 17: మండలంలోని నేరెళ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి మూడిళ్లలో చోరీ జరిగింది. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కంతి మహేష్ ఇంటిలో ప్రవేశించి రూ 2.35 లక్షలు నగదు, కంతి నరేష్ ఇంటిలో తులంనర బంగారు ఆభరణాలు, బొనగంటి రాజవ్వ ఇంటిలో 20 తులాల వెండి, అర తులం బంగారం, ఐదు వేలు నగదును అపహరించారు. రాత్రి వేళలో ఆ ముగ్గురు వ్యక్తులు ఇంటిలో పడుకుని ఉన్న సమయంలో వచ్చిన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు.

ఫిట్స్‌తో మతిస్థిమితం లేని మహిళ మృతి



పొన్నం కవిత (ఫైల్)

వేములవాడ టౌన్, మే 17: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున ఫిట్స్‌తో మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం కవిత (36) అనే మహిళకు మతిస్థిమితం కోల్పోయి ఇంట్లోనే వుంటుంది. నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి పారిపోయిన కవిత ఫిట్స్‌తో నాంపల్లి గ్రామంలో మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలికి మతిస్థిమితం సరిగా ఉండదని, ఫిట్స్, మూర్ఛ వ్యాధితో బాధపడుతుందని కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఆటో బోల్తా : ఇద్దరు డ్రైవర్ల మృతి



చెలకని రాజు(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 17: పెద్దపల్లి జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలంలో ఆటో బోల్తా పడి ఇద్దరు డ్రైవర్లు మృతిచెందారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఏదులాపూర్-పెద్దరాతుపల్లి గ్రామాల మధ్యన ఉన్న మట్టలవాగు బ్రిడ్జివద్ద ఆటో బోల్తాపడి ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన చెలకని రాజు(30) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో మహిళకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన చెలకని రాజు, బీస రజిత కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఏదులాపూర్‌లో గురువారం జరిగిన వారసంతలో కూరగాయలు అమ్ముకొని స్వగ్రామానికి బయలుదేరారు. అర్ధరాత్రి పెద్దరాతపల్లి మట్టలవాగు బ్రిడ్జి వద్ద ప్రమాదావ శాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడిక్కడే మృతి చెందగా, రజితకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్ఐ ఓంకార్ యాదవ్ చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రాజుకు భార్య భవాని, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని పాలితం గ్రామానికి చెందిన ఆలేటి భూమయ్య (42) ఆటోడ్రైవర్ ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆటో నడుపుతూ జీవనం సాగించే భూమయ్య శుక్రవారం యథావిధిగా పాలితం గ్రామం నుంచి పెద్దపల్లికి ప్యాసింజర్‌లను తీసుకోచ్చి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పాలితం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడటంతో ఆటోలో ఉన్న డ్రైవర్ భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేరని తెలిపారు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు తెలిపారు.

బిల్లుల కోసం గ్రామ పంచాయతీకి తాళం

గంభీరావుపేట, మే 17: అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్ గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. గంభీరావుపేట మండలం కొళ్లమద్ది మాజీ సర్పంచ్ ఏనుగు కేశవరావు ఈజీఎస్ పథకం కింద గ్రామ పంచాయతీ భవనం మంజూరవడంతో రూ.20 లక్షలతో నిర్మించారు. మరో ఎనిమిది లక్షల రూపాయలను గ్రామాభివృద్ధికి వెచ్చించారు. ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వకుండా సర్పంచులను నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. సర్పంచుల గౌరవ వేతనం కూడా మూడు సంవత్సరాలది పెండింగ్‌లో ఉన్నదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఐదు నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులుగానీ, సర్పంచుల పెండింగ్ బిల్లులు గానీ విడుదల చేయలేదన్నారు. బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

సౌత్ ఆఫ్రికాలో కొత్తపేట వాసి మృతి

ఎండపల్లి, మే 17: ఉపాధి నిమిత్తం సౌత్‌ఆఫ్రికా వెళ్లిన మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగట్టు సత్తయ్య(43) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం సౌత్ ఆఫ్రికాకు వెళ్లాడు. 20 నెలల క్రితం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి గడిపాడు. ఇటీవలే మళ్లీ వెళ్లాడు. శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో అక్కడి గదిలోనే మృతి చెందాడు. సత్తయ్య సోదరుడు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. సత్తయ్యకు భార్య పద్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

కొండగట్టులో కానరాని 'క్యాష్ లెస్' సేవలు

● మూలన పడ్డ స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ బోర్డులు

● అసౌకర్యానికి గురి అవుతున్న భక్తులు



ఆలయంలో ఓ మూలన ఉన్న క్యూఆర్ కోడ్ బోర్డు

మల్యాల, మే 17: ఆన్‌లైన్ సేవల కాలమైన నేటి రోజుల్లో ప్రజలు అత్యధికంగా 'క్యాష్ లెస్' లావాదేవీపై ఆధారపడగా ప్రతీ చోట క్యాష్‌లెస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే కొండగట్టు అంజన్న క్షేత్రంలో మాత్రం భక్తులు క్యాష్‌లెస్ సేవలకు నోచుకోవడం లేదు. దీంతో భక్తులు డబ్బుల కోసం కొండపైన తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అయిదేళ్ల క్రితం దేవస్థానం అధికారులు స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ స్కానర్‌సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. కొన్నేళ్ల క్రితం కార్డులు ఎక్కువ వినియోగించగా వాటి కోసం స్వైపింగ్ యంత్రాలను దేవస్థానం పరిధిలోని బుకింగ్ తదితర చోట్ల ఏర్పాటు చేశారు. అయితే అవి మున్నాళ్లకే అటకెక్కాయి. కాగా ఇటీవల యూపీఐ లావాదేవీలు పెరుగడంతో రెండేళ్ల క్రితం ఆలయంలో భక్తులు స్వామి వారికి చెల్లించుకునే కానుకలను సమర్పించడానికి గాను క్యూఆర్ కోడ్ స్కానర్ బోర్డులు పెట్టారు. అవి కూడా ఇటీవల మూలనపడ్డాయి. దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆన్‌లైన్ సేవల్లో భాగంగా నగదు రహిత లావాదేవీల నిర్వహణకు ఏర్పాటు చేసిన స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ బోర్డుల నిర్వహణ కొరవడడం, అవి పని చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణాలు, నగరాల నుంచి వచ్చే భక్తుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. నగదురహిత సేవలకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతన్నారు.

● ఉచిత వైఫై మేలు..

కొండగట్టు కొండపైన సెల్‌ఫోన్ సేవలు నామమాత్రమే. ఇక్కడ సెల్‌ఫోన్ సేవలను విస్తృతంగా అందించేందుకు సెల్ సంస్థలు ముందుకు రాకపోవడంతో అంతంత మాత్రమే అందుతున్న సెల్ సేవలతో ఇబ్బందులు పడుతున్న భక్తులు.. క్యాష్‌లెస్ సేవలకూ సెల్‌సేవలు విఘాతంగా మారుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు ఉచిత వైఫై సేవలపై దృష్టి సారించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. దేవస్థానానికి కోట్లాదిగా ఆదాయం భక్తుల ద్వారా వివిధ మార్గాలో సమకూరుతుండగా పలు టికెట్లు, ప్రసాదాలు, వాహన పూజలు తదితర వాటి ద్వారా నగదు లావాదేవీలు జరుగుతుంటాయి. అధికారులు నగదురహిత సేవల కోసం ఉచిత వైఫై సమకూర్చే అవకాశం మెండుగా ఉన్నా అటువైపుగా దృష్టి సారించడం లేదు.

● చర్యలు తీసుకుంటాం

చంద్రశేఖర్, ఆలయ ఈవో

కొండగట్టులో భక్తులకు క్యాష్‌లెస్ సేవలు అందించడానికి గాను తగుచర్యలు తీసుకుంటాం. యూపీఐ సేవలు అందుబాటులో తీసుకురావడంపై దృష్టి సారిస్తం. సెల్‌సేవలు అందించే సేవలు అందుబాటులో లేకపోవడంతో ఉన్నపాటి కొద్ది సిగ్నల్స్ క్యాష్‌లెస్ సేవలకు అందక ఆన్‌లైన్ సేవలకు అసౌకర్యంగా మారుతోంది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్





మాట్లాడుతున్న డా. శ్రీధర్, బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, మే 17: ఇంజనీరింగ్ విద్యార్థులు లక్ష్య సాధనతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాచుపల్లి జేఎన్ టీయూ ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిం చారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్లాస్‌లకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవటానికి కమ్యూనికేషన్స్ నైపుణ్యతను మరింత పెం చుకోవాలన్నారు.

అంతకు ముందు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్ ప్రారంభ ఉపన్యాసంతో వేదికపైకి అందరిని ఆహ్వానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. కామాక్షిప్రసాద్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ కళాశాల 2023-2024 నుంచి పదేళ్ల పాటు అటాన మస్ ప్రతిపత్తి పొందిందన్నారు. కళాశాలలో చేసిన అభివృద్ధిని ఈ సందర్భంగా వివరించారు. అనంతరం అకాడమిక్ ప్రైజెస్, స్పోర్ట్స్, గేమ్స్ ప్రైజెస్ అందించారు. యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించిన నలుగురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. బెస్ట్ స్టూడెంట్ అవార్డు సాదించిన జి తేజస్వినికి ప్రశంసా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వివిద విభాగాల అధిపతులు, భోధన, భోదనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడి మృతి



కర్రోళ్ల రాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బీఎస్పీ మాజీ మండల అధ్యక్షుడు కర్రోళ్ల రాజు (38) అనే యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. చీకటి పడడం వల్ల ఎవరూ గమనించకపోవడంతో ఆయన మృతదేహం ఎనిమిది గంటల పాటు ఘటన స్థలంలోనే పడి ఉందని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన రాజు తన బైక్‌పై ఈ నెల 16న సాయంత్రం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి వచ్చా డు. తిరుగు ప్రయాణంలో రాత్రి మండలంలోని కోరుట్లపేట శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దాంతో రాజు ఎగిరిపోయి పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలో పడి మృతి చెందాడు. ఉదయం పొలాల వద్ద కు వెళ్లిన రైతులకు మృతదేహం కనిపించడంతో సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించి నర్మాలకు చెందిన రాజుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు రాజు తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు. మృ తుడికి భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు. రాజు కొంత కాలంగా బీఎస్పీ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతు న్నాడు. రెండు పర్యాయాలు బీఎస్పీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. రాజు మృతిపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

రామడుగు, మే 17 : తమ్ముళ్ళపై దాడి చేసిన అన్న, అతని కుమారుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దత్తోజీపేట గ్రామానికి చెందిన తోట్ల రాములు, తోట్ల మల్లయ్య, తోట్ల ముత్తయ్య ముగ్గురు అన్నదమ్ములు కాగా గత కొంత కాలంగా వ్యవసాయ భూమిపై గొడవలు జరుగుతున్నాయి. అందులో బాగంగా గురువారం రాత్రి గ్రామ శివారులో ముత్తయ్య, మల్లయ్యలు మోటార్ సైకిల్‌పై వెల్లుతుండగా అన్న రాములు, అతని కుమారుడు తోట్ల మహేందర్‌లు కర్రలతో దాడికి పాల్పడగా గాయాల పాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మల్లయ్య కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

గోదావరిఖనిలో తల్లీకూతుర్ల అదృశ్యం

కోల్‌సిటీ, మే 17: గోదావరిఖని భరత్‌నగర్‌కు చెందిన దాసారపు రజిత(23) అనే వివాహిత, ఆమె కూతురు అనన్య (21నెలలు)ను తీసుకుని గురువారం ఉదయం నుంచి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. భార్యభర్తల మధ్య గొడవ జరుగగా మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఆమె తల్లి సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ ని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ 8712656516, ఎస్ఐ టీ శ్రీనివాస్ 9010072555కి సమాచారం ఇవ్వాలని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కోరారు.

బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం

ఎండపల్లి, మే 17: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఆర్టీసీ బస్సును వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న దాదాపు వంద మందికి ప్రాణాపాయం తప్పింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కరీంనగర్ నుంచి మంచిర్యాలకు వెళుతున్న టీఎస్ 02 యూఏ 3672 అనే నంబర్ గల బస్సు మండలంలోని కొత్తపేట గ్రామానికి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోను తప్పించబోయి బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఒకేసారి పెద్ద శబ్ధం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించారు.

గంభీరావుపేటలో విషాదం

గంభీరావుపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం గంభీరావుపేట మండలంలో విషాదం అలుముకుంది. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బీఎస్పీ నేత కర్రోల్ల రాజు కొరుట్లపేట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు రాజు అనేక సమస్యలపై ప్రజలతో కలిసి ఉద్యమించాడు. బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడిగా చాలాకాలం పనిచేశాడు. కర్రోల రాజు ఆకస్మిక మరణం తన సొంత గ్రామమైన నర్మాలతో పాటు మండల వ్యాప్తంగా విషాద చాయలు చోటు చేసుకున్నాయి. బీఎస్పీ శ్రేణులు, స్నేహితులు, బంధువులు, పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు రాజు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పూర్ణాహుతి.. సహస్ర కలశాభిషేకం

- కొనసాగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలు - స్వామి వారలను దర్శనం చేసుకున్న భక్తులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



అభిషేకం కోసం కలశం తీసుకెళ్తున్న ఆలయ ముఖ్య అర్చకులు

ధర్మపురి, మే 17: ధర్మపురి క్షేత్రంలో ఐదో రోజు శుక్రవారం నరసింహ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేక పూజలు, సహస్ర కలశాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనాది ఆరాధన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండలి, స్థాపిత దేవతా పూజలు అనంతరం స్వామివారికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. లోక క్షేమార్థం యాగశాల వద్ద అర్చకులు హోమం నిర్వహించారు. స్వామి వారలను అందంగా అలంకరణ చేశారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, చిలుకముక్కు రమణాచార్యా, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక లోడు.. అవస్థలు చూడు!



అధిక లోడుతో వెళుతున్న లారీకి అడ్డు తగిలిన తీగలు

ఎల్లారెడ్డిపేట, మే 17: అసలే కిందకు వేలాడుతున్న తీగలు.. భారీ వాహనాలు వెళితే మరో వాహనం ప్రయాణించేందుకు కష్టంగా ఉన్న రోడ్డు.. ధాన్యం బస్తాలు నింపుకుని అధిక లోడుతో వెళుతున్న లారీకి కరెంటు స్తంభాల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యుత్తు సర్వీస్ తీగలు అడ్డు తగిలాయి. అడుగడుగునా తీగలు అడ్డురావడంతో లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపి పైకెక్కి తీగలను సరి చేసి మళ్లీ ముందుకు సాగాడు. ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డులో అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీ వల్ల శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక లోడుతో భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల తమ ఇళ్ల సరఫరా అయ్యే విద్యుత్తు సర్వీస్ తీగలు తెగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా బైపాస్ రోడ్డు వెంట అధిక లోడుతో వచ్చే వాహనాలను అనుమతించకూడదని కోరుతున్నారు.



తీగలను తీసేందుకు ఇబ్బంది పడుతున్న వాహన డ్రైవర్

గీతకార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, మే 17 : మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు బండి శ్రీనివాస్ గురువారం తాటిచెట్టుపై నుంచి జారిపడి గాయాలపాలైనట్లు గౌడ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడడు బాలసాని సతీష్‌గౌడ్ తెలిపారు. స్థానికులు గుర్తించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గాయపడిన గీత కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మారం, మే 17: మండలంలోని ఖిలావనపర్తి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 19న స్వామివారి కల్యాణం, 24న రథోత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోల్‌సిటీ, మే 17: విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శనివారం గోదావరిఖనిలోని రాంనగర్‌లోని సబ్‌స్టేషన్, జనగామ, అల్లూరు, పీజీ సెంటర్, గౌతమినగర్ విద్యుత్ ఉప కేంద్రాల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు కన్నాల వేంకటేశ్వరస్వామి కల్యాణం

మంథని, మే 17: మండలంలోని కన్నాలలో కొలువై ఉన్న శ్రీదేవీ-భూదేవీ-సమేత శ్రీవేంకటశ్వస్వామి కళ్యాణ వేడుకలు శనివారం ప్రారంభంకానున్నట్లు ఆలయ ధర్మకర్తలు, గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. ఆదివారం రాత్రి7.30 స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 23న జరిగే రథోత్సవం, నాగవెల్లితో స్వామి కల్యాణోత్సవం ముగుస్తుందన్నారు. స్వామి కల్యాణానికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు భక్తులను కోరారు.

ఆవును ఢీకొట్టి వెళ్లిన ఇసుక లారీ

మంథని, మే 17: మండలంలోని ధర్మారం గ్రామ శివారులో ఇసుక లారీ ఆవును ఇసుక లారీ శుక్రవారం ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. అటు వస్తున్న మంథని గౌతమేశ్వర గోశాల నిర్వాహకులు ఆకుల విద్యాసాగర్ గాయపడ్డ ఆవును చూసి గోపాలమిత్ర బుద్దార్తి మల్లేష్ సమాచారం అందించారు. మల్లేష్ గాయపడ్డ ఆవుకు చికిత్స చేశారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అన్నదానం

సుల్తానాబాద్, మే 17:ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం చేశారు. పునరావాస కేంద్రంలో ఉంటున్న మానసిక దివ్యాంగులకు రెడ్ క్రాస్ జిల్లాకమిటీ చైర్మన్ కావేటి రాజగోపాల్ ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు సత్యనారాయణ,నీలయ్య అరుణ పాల్గొన్నారు.

చిన్నవాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలి

పెద్దపల్లి రూరల్, మే 17 : మండలంలోని కొత్తపల్లి పరిధిలోని తెనుగుపల్లి వద్ద చిన్నివాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ డీఈని గ్రామస్థులు కలిసి విన్నవించారు. వర్షకాలంలో వంతెన నిర్మాణం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టి నిర్మాణం చేపట్టాలని డీఈని కోరారు. గ్రాంతిలెనిన్, కనుకుంట్ల సుమన్, బొబ్బిలి రాకేష్ పాల్గొన్నారు.

ఇందుర్తిలో విషాదం

ఓదెల, మే 17 : మండలంలోని ఇందుర్తికి చెందిన చిరు వ్యాపారి చెలికాని రాజు(35) రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.వారసంతలో అల్లం, ఎల్లిగడ్డలు విక్రయిస్తూ విక్రయించుకొని తిరిగి వస్తుండగా కాల్వశ్రీరాంపూర్ మండలం ఈదులపూర్ మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందడం వల్ల కుటుంబానికి పెద్దదిక్కు లేకుండాపోయింది. మృతునికి భార్య భవాని, కూతురు, కుమారుడు ఉన్నారు.

భార్యపై బ్లేడ్‌తో భర్త దాడి

యైటింక్లయిన్‌కాలనీ, మే 17: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి బంగ్లాస్ ఏరియాలో శుక్రవారం శ్రీనివాస్ అనే యువకుడు తన భార్య స్వప్నపై బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచాడు. కేకేనగర్‌కు చెందిన శ్రీనివాస్ భార్య స్వప్న బంగ్లాస్ ఏరియాలోని ఓ క్వార్టర్‌లో పనిచేస్తోంది. మద్యం సేవించి సదరు క్వార్టర్‌కు వచ్చిన శ్రీనివాస్ బ్లేడ్‌తో భార్య స్వప్నను గాయపరిచాడు. స్వప్న పరుగులు తీయగా రోడ్డుపై మరోసారి దాడికి చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి స్వప్నను ఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి టౌన్, మే 17 : విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పెద్దపల్లి పట్టణంలోని అమర్‌నగర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను పరిశీలించి, వేసవి సెలవుల్లో ఆట, పాటలతోపాటు చదువు నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నామని వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమ్మర్ క్యాంపులోని విద్యార్థులతో ముచ్చటిస్తూ పిల్లలు పెద్దయ్యాక ఏం అవ్వాలనుకుంటున్నారు అని ప్రశ్నించారు. డాక్టర్, ఆర్టిస్టు, సైనికుడు, టీచర్, ఇంజనీర్ అవుతామంటూ విద్యార్థులు తెలియజేశారు. జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ వారికి సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను తెలుసుకోవాలని, దానికి అనుగుణంగా సన్నద్ధం కావాలని కలెక్టర్ తెలిపారు. సైన్యంలో చేరాలంటే శారీరకంగా సైతం మనం బాగా దృఢంగా తయారు కావాలని, అదే విధంగా పెయింటింగ్ ఆర్టిస్టుగా ఎదగాలంటే ఇంటి నుంచి వచ్చే ఒత్తిడులను తట్టుకుంటూ దృఢంగా ఉండాలని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ముందస్తుగా మనం మంచి ఆరోగ్యంతో ఉండాలని, దీనికోసం చిన్నతనం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. చిన్నతనం నుంచే ఇంటి ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలని, మంచి పౌష్టికాహారాన్ని మాత్రమే తీసుకోవాలని, రోజు కొంత సమయం శారీరక దృఢత్వం కోసం వ్యాయామం, క్రీడలు ఆడటం వంటివి చేయాలని అన్నారు. చిన్నతనం నుంచే పిల్లలు పుస్తక పఠనం అలవర్చుకోవాలని అన్నారు. మనం పెద్ద ఆశయాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధనదిశగా కృషి చేయాలని, ఇటీవల కాలంలో భారతదేశ శాస్త్రవేత్తలు చంద్రయాన్ 3 ను విజయవంతంగా చంద్రుడిపైకి పంపారని, పిల్లలు వీటిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో గొప్ప స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. సమ్మర్ క్యాంప్ లోని పిల్లలు వారు వేసిన పెయింటింగ్ లను కలెక్టర్ కు చూపించి, వాటిపై కలెక్టర్ ఆటోగ్రాఫ్ చేయించుకున్నారు. అనంతరం పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పాఠశాలల్లో టాయిలెట్లు, ఇతర వసతులు ఉండేలా పర్యవేక్షించాలని రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సమ్మర్‌క్యాంప్ వాలంటీర్ మితేష్‌సింగ్, సమ్మర్‌క్యాంప్ పిల్లలు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రక్తపోటు నియంత్రణతో ఎక్కువ కాలం జీవించవచ్చు

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుమన్

పెద్దపల్లిటౌన్, మే 17: రక్త పోటును నియంత్రించుకోవడంతో ఎక్కువ కాలం జీవించవచ్చని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా యూపీహెచ్‌సీ పెద్దపల్లి నుంచి కమాన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని ప్రతి ఏటా మే 17న జరుపుకుంటామని, 30సంవత్సరాల వయస్సు దాటిన వాళ్లు అందరూ రక్త పోటు పరీక్షలను క్రమంగా చేయించుకోవాలన్నారు. రక్తపోటు నిర్ధారణ అయినా వారికీ ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా మందులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఒకసారి రక్తపోటు వ్యాధి నిర్ధారణ అయితే జీవితాంతం ఈ మందులను వాడుతూ రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. రక్తపోటును ఖచ్చితంగా కొలవండి నియంత్రించండి.. ఎక్కువ కాలం జీవించండి.. అనే థీమ్‌తో రక్తపోటు దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రక్తపోటును నియంత్రించుకోవడం ద్వారా గుండెపోటుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా కార్యాలయాల ఉద్యోగులందరికీ బీపీ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించి బీపీ నిర్ధారణ అయినా వారికి మందులు అందించామనిన్నారు బీపీ నిర్ధారణ కార్యక్రమాలు 25 జూన్ 2024 వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో బీపీ స్క్రీనింగ్ క్యాంపులు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలందరూ సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని : ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశాల మేరకు సింగరేణి ఏరియా ఆసుపత్రి డిప్యూటీ సీఎంఓ కిరణ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో రక్తపోటు నియంత్రణ గురించి ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆరోగ్య అధికారి సుమన్ ఆసుపత్రికి వచ్చిన కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అధిక రక్తపోటు(లేదా హైపర్‌టెన్షన్) దుష్ప్రభావాలు, ప్రమాద కారకాలు, నియంత్రణ గురించి వివరించారు. హృదయ సంబంధ వ్యాధులకు అధిక రక్తపోటు ప్రధాన కారణమని తెలిపారు. రక్తపోటు స్థితిపై మెరుగైన అవగాహన ప్రారంభ చికిత్సను గణనీయంగా పెంచుతుందని, వారానికి 150 నిమిషాల వరకు ప్రతిరోజూ 30 నుంచి 45నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. రెగ్యులర్ చెకప్ కోసం వైద్యులని సంప్రదించడం వల్ల హైపర్టెన్సివ్ సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైసీఎంఓ డాక్టర్ అంబిక, డాక్టర్ రవి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ మురళి, డాక్టర్ ప్రశాంత్, ఇతర వైద్య సిబ్బంది, ఆసుపత్రికి వచ్చిన అవుట్ పేషెంట్ రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ హైపర్‌టెన్షన్(అధికరక్తపోటు)దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికరక్తపోటు, రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను గూర్చి వివరించారు. ప్రతిరోజు తీసుకునే ఆహారం, డాక్టర్లు సూచించిన మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలని చెప్పారు. కాగా ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ నిస్సికి ష్టాన, సిహెచ్‌వో విజేందర్‌రాజు, సుపర్‌వైజర్‌లు లక్ష్మణ్, నాగరాణి, హెల్త్ ఎడ్యూకేటర్ రాజేశ్వరిదేవి, పర్మాసిస్ట్ శిరీష, ఎన్‌ఎం అమృత, ఆశాలు ప్రేమలత, పంచాయతీ కార్యదర్శులు ఆకుల సౌమ్య, సునీత, సదానందం, వినోద్, అభిజిత్, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎలిగేడులో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్



ఓదెల ఆసుపత్రిలో డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్

ఓదెల, మే 17 : అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రానున్న వానాకాలంలో అంటువ్యాధులు వ్యాపించకుండా ఇప్పటినుంచే ప్రజలను అప్రమత్తం చేయాలని, అలాగే పరిసరాల పరిశుభ్రత నిర్వహణపై అధిక శ్రద్ధ వహించాలని కోరారు. గ్రామాల్లో చికిన్ గున్యా వ్యాపించకుండా తగు చర్యల కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి వెంట పలువురు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

ఓదెల, మే 17: మండల కేంద్రానికి చెందిన తాడికొండ లక్ష్మి మృతి చెందినప్పటికీ ఆమె నేత్రాలు సజీవంగా ఉన్నాయి. అనారోగ్యంతో శుక్రవారం లక్ష్మి మృతిచెందగా ఆమె కుమారుడు చీకట్ల మొండయ్య దంపతులు ఆమె నేత్రాలను దానం చేశారు. ఈ మేరకు సదాశివ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి ఆధ్వర్యంలో నేత్రాలను ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ టెక్నీషియన్ సతీష్ సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. దీంతో మరో ఇద్దరు అంధులకు చీకటి నుంచి వెలుగును ప్రసాదించారు. ఈ మేరకు నేత్రదానానికి కృషిచేసిన కానిస్టేబుల్ కార్తీక్, శ్రీమన్నారాయణ, మృతురాలి మనవలు, మనవరాళ్లు పలువురుని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, క్యాతం వెంకటేశ్వర్లు, వేణు, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, క్యాతం మల్లేశం, కేఎస్ వాసు పాల్గొన్నారు.

మంజుశ్రీకి ఘన నివాళి



మంజుశ్రీకి నివాళులు అర్పిస్తున్న కేశోరాం అధికారులు

పాలకుర్తి, మే 17: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీ వ్యవస్థాపకుడి కూతురు, బిర్లా సంస్థల చైర్మెన్ మంజుశ్రీ గురువారం కలకత్తాలో మృతిచెందగా, శుక్రవారం స్థానిక కేశోరాం సిమెంటు కంపెనీ ప్రధాన ద్వారం ముందు ఆమె సంతాప సభ నిర్వహించి అశ్రునివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్లాంట్‌హెడ్ ఎం శ్రీనివాసరెడ్డి,ఎచ్ ఆర్ మేనేజర్ ఎస్ గోవిందరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

కోల్‌సిటీ, మే 17: గోదావరిఖని మేదరిబస్తీలో గత 20సంవత్సరాలుగా విద్యుత్ సమస్యలతో ప్రజలు సతమతమవుతుండగా ఇటీవల రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ రెండు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మేదరిబస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20ఏళ్లుగా మేదరిబస్తీలో విద్యుత్ లోడ్ అధికం కావడంతో కొత్తగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు

సుల్తానాబాద్, మే 17: మండలంలోని భూపతిపూర్‌లో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఎం స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం కోసం హాస్టల్ వసతితో పాటు 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసీ అండ్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) ఇంగ్లీష్ మీడియం తరగతులలో ప్రవేశాలు పొందాలని అసక్తి గల విద్యార్థులు ఫోన్. 9963471638లో కానీ నేరుగా కళాశాలలో గాని సంప్రదించాలన్నారు. ఆవ తరగతి వారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సంప్రదించాలన్నారు

అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టవద్దు



రాఘవపూర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో

పెద్దపల్లి రూరల్, మే 17: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకున్న తరువాతనే నిర్మాణ పనులు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆశాలత అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవపూర్‌లో పారిశుద్యం, తాగునీటి సరఫరా, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డులను జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీ లించారు. ఈ సందర్భంగా డీపీవో ఆశాలత మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడితే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే పనులు నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలని, పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్డులో వర్మి కంపోస్టు ఎరువును తయారు చేసేందుకు చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా నీరు సరఫరా చేయాలన్నారు. శానిటే షన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా పంచాయతీ అధికారులు ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని సూచించారు.

సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగించాలి

- డీఎల్‌పీవో వేణుగోపాల్



మూలసాలలో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

పెద్దపల్లి రూరల్, మే 17 : గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగించాలని డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మూలసాల, కొత్తపల్లి గ్రామాల్లో పారిశుద్యం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో స్మశానవాటిక, పలు వీధులను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో వేణుగోపాల్ మాట్లాడుతూ వానా కాలం దృష్ట్యా మురికి కాలువలు శుభ్రం చేయించాలని, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను రక్షించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల్లో పలు రికార్డులను పరిశీలించారు. ఇరు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రమేష్, శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



ఆపరేటర్‌ల పదోన్నతులపై వినతి



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయుసీ నాయకులు

రామగిరి, మే 17: ఆపరేటర్ పాలసీ విధానం సజావుగా జరిపించాలని కోరుతూ శుక్రవారం ఏఐటీయూసీ నాయకులు వైవీరావు, జూపాక రాంచందర్ తదితరులు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎఫెక్ట్ డేట్ ఆధారంగా గ్రేడ్స్ కల్పించాలని, 121-136వ బ్యాచ్ వరకు ఉన్నా ఆపరేటర్ల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీటీ రావు, గంగాధర్, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ముగిసిన డాడ్జ్‌బాల్ పోటీలు



బాలికల జట్టుకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ

యైటింక్లయిన్‌కాలనీ, మే 17: తెలంగాణ డాడ్జ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలు శుక్రవారంతో ముగిశాయి. రాత్రి స్థానిక సీఈఆర్ క్లబ్‌లో జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి జీఎం సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సింగరేణి ఎల్లప్పుడు క్రీడలను ప్రోత్సహిస్తుందని, ఆర్జీ-2 ఏరియాలో జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నట్లు తెలిపారు. పోటీల్లో గెలిచిన బాలికల జట్లకు గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, బాలుర జట్లకు జీఎం సూర్యనారాయణలు బహుమతులను అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు అనిల్‌కుమార్, పాశం శ్రీనివాస్, ఓదేలు, సత్యం పాల్గొన్నారు.

బూడిద సరఫరా బంద్..

- వేలం ద్వారా కొనుక్కోవాలంటున్న ఎన్‌టీపీసీ సంస్థ



జీడీకే 2ఇంక్లైన్ శాండ్ బంకర్‌లో ఇసుకను నింపుతున్న లారీ



ఎన్‌టీపీసీ బూడిద చెరువులో మేటలు వేసిన బూడిద

గోదావరిఖని, మే 17: సింగరేణి అండర్‌గ్రౌండ్ బొగ్గు గనుల్లో బొగ్గు తీసిన ఖాళీ సొరంగాల్లో నింపేందుకు సింగరేణికి ఎన్‌టీపీసీ ఉచితంగా ఇచ్చే బూడిద(బాటమ్ యాష్)ను బంద్ చేసింది. ఈ యాక్షన్‌లో క్యూబిక్ మీటర్ల లెక్కన బూడిదను కొనుక్కోవాలని ఎన్‌టీపీసీ తేటతెల్లం చేసింది. నెలరోజులుగా ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 1ఇంక్లైన్, 2,2ఏ ఇంక్లైన్‌లలో స్టాండ్ స్టోవింగ్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో సింగరేణి ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు పూనుకున్నది. మేడిపల్లి ఓపెన్‌కాస్టు సమీపంలో ఏర్పాటు చేసిన పీఓబీ ప్లాంట్ నుంచి ఇసుకను తీసుకువచ్చి అండర్‌గ్రౌండ్ బొగ్గుగనుల్లో సాండ్ స్టోవింగ్ చేస్తున్నది. ఇరవై సంవత్సరాల క్రితం ఎన్‌టీపీసీ సింగరేణికి బూడిదను తానే సరఫరా చేసింది. ఆ తరువాత సింగరేణికి ఎన్‌టీపీసీ బూడిద ఉచితంగా ఇచ్చింది. సింగరేణి కేవలం ట్రాన్స్‌పోర్టు చేసుకున్నది. ఈ మూడు బొగ్గుబావుల్లో శాండ్ స్టోవింగ్ చేసేందుకు ప్రతిరోజు 2000క్యూబిక్ మీటర్ల బూడిద అవసరం ఉంటుంది. రెండేళ్లుగా ఎన్‌టీపీసీ బూడిదకు మార్కెట్‌లో డిమాండ్ పెరగడం, ఈ టెండర్ల ద్వారా ఎన్‌టీపీసీ బూడిదను అమ్ముకోవడంతో సింగరేణికి ఉచితంగా ఇచ్చేందుకు నిరాకరించింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ నుంచి ఎన్‌టీపీసీలో రోజూ ఉత్పత్తి అవుతున్న బూడిదను ప్రభుత్వరంగ సంస్థ అవసరాలకు, స్వచ్ఛంద కార్యక్రమాలకు, జాతీయ రహదారుల అవసరాలకు ఉచితంగా ఇవ్వాల్సిన సూచనలు ఉన్నాయి. కానీ ఫ్లైయాష్ బ్రిక్స్ కోసం ఈ బూడిదను ఇటుక బట్టీల యజమానులు వాడుతుండడంతో ఈ యాక్షన్‌లో ఒక క్యూబిక్ మీటర్ బూడిద రూ.273 నుంచి రూ.339వరకు టెండర్లలో అమ్మకానికి పోయింది. ప్రతి సంవత్సరం ఎన్‌టీపీసీ 25లక్షల క్యూబిక్ మీటర్ల నుంచి 40లక్షల క్యూబిక్ మీటర్ల వరకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. సింగరేణికి ప్రతి సంవత్సరం సుమారు 7లక్షల క్యూబిక్ మీటర్ల బూడిద ఉచితంగా వచ్చేది. ఎన్‌టీపీసీ ఈ యాక్షన్‌లో బూడిదను తీసుకోవాలని చెప్పడంతో సింగరేణికి సాండ్ స్టోవింగ్ సమస్య తెరమీదికి వచ్చింది. సింగరేణి జైపూర్ విద్యుత్ ప్లాంట్ నుంచి వస్తున్న బూడిదను కూడా సింగరేణి ఈ యాక్షన్ ద్వారా అమ్ముతున్నది. ఈ కారణాన్ని చూపి ఎన్‌టీపీసీ సింగరేణికి బూడిదను ఉచితంగా ఇచ్చేందుకు నిరాకరిస్తున్నది. జైపూర్ ప్లాంట్‌లో రోజూ 2500 క్యూబిక్ మీటర్ల బాటమ్ యాష్ వెలువడుతుంది. ఇది మొత్తం శ్రీరాంపూర్ ప్రాంతంలోని అండర్‌గ్రౌండ్ బొగ్గుగనుల సాండ్ స్టోవింగ్‌కు సరిపోవడంతో పాటు ఈ వేలంపాటలో కూడా కొంత అమ్ముతున్నారు. పైగా జైపూర్ ప్లాంట్ నుంచి ఆర్‌జీ-1కు ఫ్లైయాష్ తీసుకురావడం ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా పెరగనున్నాయి. సింగరేణి పీవోబీ ప్లాంట్‌లలో క్యూబిక్ మీటర్ల ఇసుక కేవలం రూ.170కి మాత్రమే ఉత్పత్తి అవుతున్నది. రోజూ 1200 నుంచి 1500క్యూబిక్ మీటర్ల సాండ్,పీవోబీ ప్లాంట్ల నుంచి సింగరేణికి లభ్యమవుతున్నది. ప్రస్తుతం ఈ పరిమాణాన్ని మాత్రమే సింగరేణి అండర్‌గ్రౌండ్‌ల్లో శాండ్ స్టోవింగ్‌కు వినియోగిస్తున్నది. దీంతో పాటు సింగరేణి సాండ్ స్టోవింగ్‌కు సంబంధించి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వెతుకుతున్నది. ఎన్‌టీపీసీ నుంచి ఈ యాక్షన్‌లో బూడిద కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ కాంట్రాక్టర్లతో కూడా సంప్రదిస్తున్నట్టు తెలిసింది. రూ.300లకు పైగా క్యూబిక్ మీటర్‌కు ఎన్‌టీపీసీ వద్ద బూడిద కొనుగోలు చేసిన కాంట్రాక్టర్లు సరఫరాతో సహా క్యూబిక్ మీటర్‌కు రూ.550చెల్లిస్తే బూడిద సరఫరా చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిసింది. కానీ పీఓబీ నుంచి రూ.170కే ఉత్పత్తి అవుతున్న సాండ్‌ను కేవలం క్యూబిక్ మీటర్‌కు రూ.140ట్రాన్స్‌పోర్టు చార్జీల ద్వారా సింగరేణి సాండ్ స్టోవింగ్ చేయించుకుంటున్నది. అంటే రూ.330కే ఉత్పత్తి, రావాణా అంతా జరిగిపోతున్నది. అయితే అండర్‌గ్రౌండ్ బొగ్గుగనుల్లో సాండ్ స్టోవింగ్ అవసరాలు పెరిగితే సింగరేణి, పీవోబీల నుంచి ఉత్పత్తి అయ్యే సాండ్ సరిపోయే అవకాశాలు లేవు. కనుక సింగరేణి యాజమాన్యం నరాసరి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖతో ఈ అంశంపై మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నది. ప్రస్తుతం ఆరుమాసాల వరకు బూడిదను ఉచితంగా ఇవ్వమని స్థానిక సింగరేణి యాజమాన్యం ఎన్‌టీపీసీని కోరినప్పటికీ అందుకు ఎన్‌టీపీసీ అంగీకరించడం లేదు. రామగుండం ఎన్‌టీపీసీలో రోజూ 12000 టన్నులకంటే అదనంగా బూడిద వెలువడుతున్నది. ఇప్పటికే ఎన్‌టీపీసీ కుందనపల్లి యాష్‌పాండ్‌లో లక్షలాది క్యూబిక్ మీటర్ల బాటమ్ యాష్ మేటలుగా పడి ఉన్నది. ప్రస్తుతం ప్రతి సంవత్సరం ఉత్పత్తిఅయ్యే బూడిదను మాత్రమే ఎన్‌టీపీసీ ఈ టెండర్ ద్వారా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నది. కానీ అది పూర్తిస్థాయిలో ఈ టెండర్ల లో అమ్మకానికి రావడం లేదు. దీంతో ప్రతి ఏటా ఎన్‌టీపీసీ యాష్‌పాండ్‌లో బూడిద పెరుగుతున్నది. దీనికి తోడు ఎన్‌టీపీసీ తెలంగాణ విద్యుత్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది.అంటే ఎన్‌టీపీసీ రోజూ బాటమ్ యాష్ వెలువడుతున్నది. తెలంగాణ విద్యుత్ ప్లాంట్ల నుంచి వెలువడే బూడిదను డంప్ చేసేందుకు సింగరేణి సంస్థ మేడిపల్లి ఓపెన్‌కాస్టు ప్రాజెక్టును ఎన్‌టీపీసీకి అప్పగించింది. పరస్పరం ఎన్‌టీపీసీ, సింగరేణికి ప్రభుత్వరంగ సంస్థలుగా ఇంతకాలం కొనసాగిన సత్సంబంధాలను ఎన్‌టీపీసీ పరిగణనలోకి తీసుకోవడం లేదనే అభిప్రాయం సింగరేణి యాజమాన్యంలో వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణికి ఎన్‌టీపీసీ బూడిదను ఉచితంగా ఇవ్వాల్సిన పర్యావరణపరమైన ఒత్తిడిని పెంచేందుకు సింగరేణి ప్రయత్నిస్తున్నది. ఏదేమైనా 20 ఏళ్లుగా ఉచితంగా బూడిదను సింగరేణికి అనుమతించిన ఎన్‌టీపీసీ ఇప్పుడు మొండికేయడం పారిశ్రామిక వివాదంగానే మారింది.